కాలూ, టిఫిన్లూ, భోజనాలూ సినీమాలు తగులాయని. రాత్రి బాపనయ్య అరుగుమీద చాలా మంది జనం వేచియుండేవారు. రోజురోజుకీ బాపనయ్యగారి భజనల హోరు తీవ్రమయేది. వూరు రెండు పార్టీలైపోయింది. ఛార్జీలూ, కవుంటరు ఛార్జీలూ దాఖలయ్యాయి.

ఈ లోగా చెంచ్రాయుడు భూమి ఆక్రమణ దావా తెచ్చాడు మునెయ్యపినతండ్రి కొడుకుపైన. రాయడి అన్నకూతుర్ని ఇంట్లోంచి గెంటేసేడు మునెయ్య మేనమామకొడుకు. ఈ వేడిలో వీళ్లందరి ధర్మమా అని జట్కా వాళ్ళకి యింతో అంతో ముట్టింది. గ్రామస్థులంతా కలిసి వేద్దామనుకున్న రోడ్డుస్కీము వెనకబడింది.

మా సెలవులు అయిపోయాయి. మేం తిరుగు మొహం పట్టాం. దారిపొడుగునా రామం హుషారుగా కబుర్లు చెప్తున్నాడు. ముందు జట్కా సాయిబు బీడీపొగా, వెనక, మేము వదిలివేసిన ధూళీ, దూరాన్ని గంభీరపర్వత పంక్తుల్లోంచి వినవచ్చే సెలయేటి రాగాలాపనా,—ప్రకృతి మమ్మల్ని వెక్కిరిస్తున్నట్లు అనిపించింది.

స్కెచ్

# పసివృద్ధు సుందరం

ఆర్. యం. చిదంబరం

తల్లి కేకలువిని నిద్రనుండి మేల్కొన్నాడు సుందరం. నిద్ర అసలు చాలకుండా ఆరోగ్యం క్షీణించిపోతున్నా యథాప్రకారంగా తల్లి నాలుగు గంటలకు లేపటం మానటంలేదు. సుందరానికి చిర్రెత్తింది. ఆ యిల్లొక నరకంగా, ఆ యింట్లో తనవారన్న పేరుతో మసలే ఆడామగా యమకింకరుల్లా కనిపించారు. "అబ్బా! రోజూ చంపుతారెందుకే? అయినా సెలవల్లో కూడా ఈ చదువేనా? క్షణం నిద్రపోనీరు. కళ్లు మండిపోతున్నాయి" అనరిచాడు కోపంగా సుందరం.

"ఏడిశావ్! వెధవా! లే! సినిమాలకు, షికార్లకు తిరగమంటే తిరుగుతావు. చదువంటే బద్ధకం. నీకేమిటిరా? ఈ కాలపువాళ్ళందరికీ ఇదే బాధ - చదవకపోతే పరీక్షపట మెలాగు? సెలవలు చదువుకుందుకిచ్చారుగాని కుంభకర్ణుడిలా నిద్రపోవటానికికాదు. లే-అనవసరంగా వాగింవావంటే వీపు చిట్లిపోతుంది."

"నాలుగింటికి అలారం పెట్టమంటే కొడుకుమీద ప్రేమతో అలారం పెట్టడం మానేసింది, మా అందరికీ లేని ఉపకారబుద్ధి కరుణ ఈ తల్లికి వచ్చాయి" అని తరుణాన్ని సక్రమంగా ఉపయోగించుకుంది మామ్మ.

ఇక లేవకపోతే బ్రహ్మాస్త్రం ప్రయోగించబడుతుందని పెరట్లోకి పరుగెత్తాడు. చీకటి బాగా ముసురుకొనుంది. చెట్లన్నీ నిశ్చలంగా నిలుచున్నాయి. మొహం కడుక్కుంటూ యోచింపసాగాడు. నిరంతరం తననిలాగ "చదువు. చదువ"ని పీక్కుతింటూనేవున్నారు. ఇలా అఘోరిస్తూంటే కొంతకాలానికి పిచ్చాసుపత్రిని పవిత్రంచేయవలసి వస్తుంది. అతని స్కూల్లో బి.ఏ. ప్యాసైన మేష్టారొకరున్నారు. ఆయనచదువు సంద్రంలోమునిగితే సంద్రంలోని విషజంతువులు మెదడంతా తినేసి వాటిస్థానే మొదటిరకం మట్టిని దిగుమతి చేయటం వలన ఆయన పిచ్చివాడైపోయాడు. రాత్రి పది గంటలదాకా యమకింకరుల్లా దగ్గరుండి చదివిస్తారు. తలిదండ్రులు తమ పనులకు సగం దృష్టినీ తక్కిన సగం పాలును సుందరం కళ్లు అక్షరాల మీద ఉండేందు రిజర్వు చేసుకున్నారు. ఇక మామ్మకు ఇతరపనులు లేవుగా! రాత్రంతా వెధవ కలలు. "చదువు-చదువు-చదువు"

అతను సినిమాలకు, షికార్లకు పోతున్నాడట! సినిమాకుపోయి రెండు నెలలయింది. రెండు నెలల క్రితమైనా తలిదండ్రులు వెళుతుంటే వద్దనివారించినా వినకుండా వారిని వెంబడించాడు. ఆ రామనాథంవారానికో సినిమా చూస్తాడు. అతనెప్పుడూ చదివినట్టే కనిపించడు. అతనెప్పుడూ సంతోషంగా ఉంటాడు. అనేక విషయాలు చర్చిస్తాడు

కాని సుందరం? అతను నిరంతరం క్లాసుపుస్తకాలు చదువుతాడు. లోక వ్యవహారాలేమీ అతనికి తెలియవు. పోనీ, అతనికేమన్నా రామనాథానికంటె ఎక్కువ మార్కులు వచ్చాయా? చదువులోకూడా వాడిదే పైచేయి. సుందరం

చదువుతాడు, కాని ఉత్సాహంలో ఎన్నడూ చదవడు. బలవంతంతో చదువుతాడు. దిగులుతో పరీక్షకు వెడతాడు. ఒక ప్రశ్నకు జవాబు రాస్తామంటే అలుముకున్న మేఘాల్లా లక్ష విషయాలు ఎదురుగా కనిపిస్తాయి. అన్నీ అస్పష్టంగా ఉంటాయి. ఏది ఏరుకుందామన్నా అన్ని రేణువులూ సర్వసమానత్వం కలిగుంటాయి. పరీక్షలో మార్కులు రాకపోతే తండ్రి తంతాడని భయం, ఆ భయంలో వచ్చిన నాలుగుముక్కలు మరచిపోతాడు. అతను పడే శ్రమ, వచ్చేమార్కులు విలోమ నిష్పత్తిలో ఉన్నాయి.

"ఇండియాకుముఖ్యపట్టణమేదిరా సుందరం?" ఒకనాడు రామనాథం అడిగాడు. సుందరం తెల్ల మొహంవేశాడు. "జాగ్రఫీ మేష్టారు అవొక్కటే చెప్ప మరిచిపోయారు" అనుకున్నాడు సుందరం. రామనాథం పకపక నవ్వాడు.

తోటి విద్యార్థులంతా మొన్న ఎక్స్‌కర్షన్‌కి వెళ్ళారు. అతనుకూడా వెడదామనుకున్నాడు. రామనాథం రమ్మని ప్రోత్సహించాడు. "నీచేతి సొమ్ము చిల్లిగవ్వకూడా ఖర్చుపెట్టవద్దు" అని హామీకూడా యిచ్చాడు. తండ్రి సమ్మతికోసం ప్రాధేయపడ్డాడు. తండ్రి ఆకాశమంతయెత్తు లేచాడు. "ఊరోజంతా బసుద్దాయిలా తిరుగుతానంటున్నావా? ఎంతచదువు దండుగైపోతుందో తెలుసా? వెర్రిమొర్రి వేషాలెయ్యక పోయి లెక్కలు చెయ్యి" అని కేకలేశాడు. గొంతుతడి ఆరేదాకా మామ్మకూడా హితోపదేశం చేసింది. మొత్తానికి తోటివారి ఆనందాన్ని పంచుకోలేకపోయాడు.

లైబ్రరీలో పుస్తకాలు చదివితే లౌకికజ్ఞానమభివృద్ధవుతుందని ఒకనాడు లైబ్రరీకి వెళ్ళాడు. అదికూడా పెద్దల దృష్టిలో ఘోరాపరాధమై కూర్చుంది. స్కూలులైబ్రరీవుండైనా పుస్తకాలు తెచ్చుకోనివ్వరు.

"మీయింట్లో రేడియోకూడా ఉందే?"

సుందరం కొత్తకంఠంవిని ఇంట్లోకి వచ్చాడు. హాల్లో తనతండ్రితో ఎవరో క్రొత్తవ్యక్తి మాట్లాడుతున్నారు.

"ఏదో! నవీనయుగంలో ఉన్నాంకదండి. అన్నీ ఉండాలి. వీడురాడికి విసుగేసినప్పుడల్లా రేడియోవేసుకుంటాడు"అనిజవాబిచ్చాడుతండ్రి.

"అబద్ధం. రేడియోపెట్టుకోవాలంటే మా నాన్న యింట్లో ఉండకూడదు. ఉంటే 'చదువో' అని అఘోరిస్తాడు" అని అందామనుకున్నాడు సుందరం. కాని తండ్రి మనస్తత్వం తెలిసినవాడు కిక్కురుమనలేదు.

దీపంముందు కూర్చున్నాడు. సైన్సుపుస్తకం చదువసాగాడు. కాని ఒక్కటీ బుర్రకెక్కలేదు. కళ్ళమ్మటనీళ్లు గిర్రునతిరిగాయి. కళ్ళుమూసినా తెరిచినా యమకింకరులు కనిపిస్తున్నారు, ఇక చదువెలాసాగుతుంది?

యేడుగంటలయేసరికి పుస్తకం మూసివేసి వీధిలోకి నడిచాడు.

"ఎక్కడికిరా?" అనడిగింది మామ్మ.

"ఇప్పుడేవస్తాను" అనేసి చటుక్కున మలుపు తిరిగాడు.

"ఇలాగైతే వీడు పరీక్షుఏస్తట్టే" అని గొణుక్కుంది మామ్మ.

"ఏమోయ్! టౌనుహాలుకు వస్తావా? మన దేశనాయకుడొకాయన వస్తున్నాడు. మీటింగు జరుగుతుంది. ఈ తరుణం పోగొట్టుకుంటే ఆయనన్ని మళ్ళీ ఎప్పుడు చూస్తామో!" అన్నాడు రామనాథం.

"ఇంటిదగ్గర చెప్పివస్తాను" అని తప్పించుకోబోయాడు.

"సారు తెలుసులే. నువ్వు ఇరవైనాలుగు గంటలూ చదువుతూంటావు. పుస్తకం నీకు పూర్ణజ్ఞానాన్ని యివ్వదు. అందరితో కలిసిమెలిసి తిరగాలి. లేకపోతే బ్రతకడం కష్టం. పుస్తకాల పురుగైపోతే ఏమి ప్రయోజనం? పోని జనరల్ బుక్స్ చదువుతావా అంటేఅదీలేదు. ఎంతసేపూ క్లాసు పుస్తకాలే!"అని లెక్చరిచ్చాడు రామనాథం.

"నిజమే-కాని మావాళ్ళు చదవకపోతే ఎముకలు విరగొడతారు. వాళ్ళమీదేగా నేను ఆధారపడుంట" అని నిస్సహాయతతో కనబర్చాడు సుందరం.

కాని రామనాథం అతనిమాటలు వినిపించుకోకుండా రెక్కపట్టుకుని టౌనుహాలువైపు యీడ్చుకుపోయాడు "ఆజ్ఞను ధిక్కరించినందుకు తను కొట్టటమేకాకుండా మేష్టరుచేత కూడా కొట్టిస్తాడు మా నాన్న" అని భయపడుతూనే స్నేహితుణ్ణి సుందరం అనుసరించాడు.